క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు



వేమూరు: వేమూరులో కొలువైన శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీ విఘ్నేశ్వర దేవస్థానంలో స్వామివార్లకు బుధవారం ప్రాతఃకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దివ్య పుష్ప మాలాంకృత అలంకారాలతో స్వామి వార్లు విశేష దర్శనమిచ్చారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనం చేసుకున్నారు.

ఐద్వా పట్టణ నూతన కమిటీ ఎన్నిక

రేపల్లె: అఖిల భారత ప్రజాతంత్ర సంఘం (ఐద్వా) రేపల్లె పట్టణ నూతన కమిటీ ఐద్వా బాపట్ల జిల్లా కమిటీ నాయకురాలు కె.ఝాన్సీ, గుంటూరు జిల్లా ఐద్వా నాయకురాలు ఆర్.స్వాతిల ఆధ్వర్యంలో పట్టణంలోని కొరటాల సమావేశ మందిరంలో బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా షేక్ షకీరా, కార్యదర్శిగా కె.నాంచారమ్మ, గౌరవాధ్యక్షులుగా ఎం.వనజాక్షి, ఉపాధ్యక్షులుగా షేక్ ఆశ, షబానా సుల్తానా, సహాయ కార్యదర్శులుగా కె.సింధుదేవి, ఫర్హాన, కె.స్వావమ్మ, సభ్యులుగా సిహెచ్ సుదీప్తి, కె.అహల్య, విధానమ్మ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు మహిళల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. మహిళల రక్షణ కోసం, వారికై చేసిన చట్టాలు పటిష్టంగా అమలు జరిగేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ట్రెజరర్ సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు మాలధారణ



సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో కొలువైన శ్రీ కేదారేశ్వర లింగ దేవస్థానంలో బుధవారం జొన్న రత్తయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయప్ప స్వామి భక్తులు మాలధారణ చేశారు. ఈ సందర్భంగా 38 మంది అయపృలు మాల స్వీకరించారు. అయపృలందరికి మాలలు, నూతన వస్త్రాలను దేవస్థానం ద్వారా నిర్వాహకులు అందచేశారు. అయప్ప స్వాములు ఎంతమంది మాలధారణ వేసుకున్నా దేవస్థానం తరపున వీటిని ఉచితంగా అందచేయడం జరుగుతుందని తెలిపారు. కార్తీక మాసంలో నెల రోజులు స్వాములకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కేఎస్‌కే విద్యాసంస్థల సీఈవో డాక్టర్ కత్తెర డేవిడ్ యశ్వంత్ జన్మదినం పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డేవిడ్ యశ్వంత్ మామ ఉన్నం యెహెజ్కేల్ మాట్లాడుతూ హర్వెస్ట్ ఇండియా సంస్థను డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినాలు ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉన్నం షకీలా, లంకా కిషోర్, సమితి నిర్వాహకులు కుర్రా శ్రీను, సతీష్, నాగేంద్ర, రవి, రజని, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని అందరూ ఖండించాలి



తెనాలిఅర్బన్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని అందరు ఖండించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేత దారా రామకృష్ణ పేర్కొన్నారు. సీజేఐపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ముత్తింశెట్టి పాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురేష్, కురగంటి మురళీ, పి.క్రాంతి, శ్యామ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ప్రజలకు మేలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చందోలు(కర్లపాలెం): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్ల కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని నీలి బంగారయ్య జిల్లా పరిషతత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ అవగాహన సదస్సుకు కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించటం వలన అమ్మకాలు, కొనుగోళ్ళు మెరుగుపడతాయని దీని వలన కొంతమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ డీడీ జి.మురళీకృష్ణ సహాయ కమిషన్ గ్లోరీకుమారి నోడల్ ఆఫీసర్ గౌరీదేవి, తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

సూపర్ జీఎస్టీపై వక్తృత్వ పోటీలు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ 2.0 – సూపర్ సేవింగ్స్‌పై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర కుమార్ పర్యవేక్షణలో బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వాణిజ్య విభాగం కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ మట్టా బుజ్జిబాబు జీఎస్టీతో కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు డాక్టర్ పి.మురళి, కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ బాల మద్దయ్యలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పోటీలలో బీకామ్ సెకండియర్ విద్యార్థి ఎం.శంకర్‌గణేష్, బీకామ్ థర్డ్ ఇయర్ విద్యార్థిని లీలాసాయిలక్ష్మిలు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. వీరికి ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్ బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు.

శక్తియాప్‌తో బాలికలు, మహిళలకు భద్రత

భట్టిప్రోలు ఎస్ఐ శివయ్య



భట్టిప్రోలు కళాశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివయ్య

భట్టిప్రోలు: మహిళల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని ఎస్ఐ ఎం.శివయ్య అన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశానుసారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో డ్రగ్స్, మహిళ భద్రత, శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ శక్తి యాప్ ఉంటే ఒక కుటుంబ సభ్యుడి తోడు ఉన్నట్లేనని పేర్కొన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే క్షణాల్లో పోలీస్ బృందం ఉన్న ప్రాంతానికి చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి చదువుకోవాలని, ఆకర్షణలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయికి సంబంధించి సమాచారం ఏదైనా తెలిస్తే డయల్ 100 లేదా 112, 1972కు వెంటనే తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత వివాదాలను రాజకీయం చేయటం తగదు



రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న హైమావతి

రేపల్లె: వ్యక్తిగత వివాదాలను రాజకీయం చేయటం తగదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గాలిమోటు హైమావతి సతీమణి గాలిమోటు హైమావతి అన్నారు. బుధవారం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆమె విలేకర్లతో మాట్లాడారు. చెరుకుపల్లి మండలం బాప్టిస్టు పాలెంలో కొక్కిలిగడ్డ శిరీషకు తనకు చిన్నపాటి వివాదం జరిగిందన్నారు. ఈ వివాదంలో శిరీషతో పాటు ఆమె కుటుంబ సభ్యులు తనపై దాడి చేసి గాయపరిచారన్నారు. మహిళల మధ్య జరిగిన చిన్నపాటి వివాదాన్ని రాజకీయ చేయటం బాధాకరమన్నారు. ఆ వివాదంలో శిరీషతో పాటు తనకు గాయాలయ్యాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కోసం వస్తే వైద్యులు రాజకీయంగా తనకు ఎటువంటి గాయాలు కాలేదని డిశ్చార్జి చేశారన్నారు. రాజకీయ ఒత్తిడితో శిరీషను వైద్యశాలలో చేర్చుకున్నారని చెప్పారు. రాజకీయంగా ఎదుగుతున్న తన భర్త రాజశేఖర్‌ను దెబ్బతీయాలని కుట్రతో అక్రమకేసులు బనాయిస్తున్నారని వాపోయారు. వివాదానికి సంబంధంలేని డాక్టర్ ఈవూరు గణేష్‌పై లేనిపోని నిందలువేసి రాజకీయంగా దెబ్బతీసేందుకు అసత్యప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పార్టీ నాయకులు, కార్యకర్తలను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సైబర్ నేరాల బారిన పడితే జీవితం అంధకారమే
- పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించిన పోలీసులు



బాలికల వసతిగృహంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు బుధవారం చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని సైబర్ నేరస్తులు వారి పంథాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటున్నారన్నారు. వాటిని నివారించాలంటే ప్రజల్లో చైతన్యం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థి దశలో మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కుకుంటే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. విద్యార్థి దశలో మహిళలు, చిన్న పిల్లలకు సంబంధించిన నేరాలపై అవగాహన కల్పించడం వలన వారు చదువుతోపాటు ఎటువంటి విపత్కర పరిస్థితి వచ్చిన ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యం వారిలో కలుగుతుందన్నారు. సైబర్ నేరాల పట్ల అన్ని విధాల సహాయం చేయటానికి జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందన్నారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో అవగాహన కొరకు వాల్ పోస్టర్లు విడుదల చేయటం జరిగిందన్నారు.

- ప్రజలు అవగాహన పెంచుకొని డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, మీ డబ్బును రెట్టింపు చేస్తాం, ఓటీపీ మోసాలు, లింకుల ద్వారా మోసాలు ఫేక్ ప్రొఫైల్‌తో జరిగే మోసాలపై ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరం జరిగిందని గుర్తించి గోల్డెన్ అవర్ లో పోలీస్ శాఖకు సమాచారం అందిస్తే బాధితుల సొమ్ము సైబర్ నేరస్థుల పాలు కాకుండా కాపాడడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండలస్థాయి సమావేశం

పెరవలి(వేమూరు): వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు మండలం పెరవలి గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న బిల్డింగ్‌లో సమావేశం జరుగుతుందన్నారు.. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారన్నారు. మండలంలోని కార్యకర్తలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

అమర్తలూరు(వేమూరు): విద్యార్థులు మానసికగా దృఢత్వంగా ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వీఎంఎల్ శాస్త్రి తెలిపారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు జెడ్పీ పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు జి.వేమయ్య, జి.చంద్రశేఖర్, డి.చంద్రశేఖర్, ఎం.శాంతి, బి.హెప్సిబా, విద్యాకమిటీ డిస్ట్రిక్ కెరీర్ అండ్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ ఇందిర ప్రియదర్శని పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఉన్న ముళ్ల పొదలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

చుండూరు (వేమూరు): జగనన్న కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారిన వైనం 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్ల కంపలను, చెట్లను బుధవారం తొలగించారు.

వైద్యశిబిరంలో 300 మందికి పరీక్షలు



మందులు అందజేస్తున్న కత్తెర సురేష్, హెని క్రిస్టినా దంపతులు

తెనాలి: హార్వెస్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పటల్ సహకారంతో బుధవారం స్థానిక ప్యాడిసన్ పేట పాట్టిశ్రీరాములు కళ్యాణమండపంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సంస్థ అధినేత కత్తెర సురేష్, హెనీ క్రిస్టినా దంపతుల తనయుడు డాక్టర్ డేవిడ్ యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటైన శిబిరాన్ని సురేష్, క్రిస్టినా దంపతులు ప్రారంభించారు. ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కాటూరి హాస్పటల్ వైద్యబృందం కంటిపరీక్షలు, గుండె, ఎముకలు, ప్రసూతి, మూత్రసంబంధిత పరీక్షలను చే శారు. అవసరమైన రోగులకు ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ, రక్తపరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు. సాయంత్రం వరకు జరిగిన వైద్యశిబిరంలో 300 మంది రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం డేవిడ్ యశ్వంత్ జన్మదిన వేడుకల్లో కెఎస్ఆర్ యూత్ భారీ కేక్ కట్‌చేశారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ సేవలు నిరుపేదలకు అండగా నిలుస్తాయని, విపత్తుల్లో సహాయానికి ముందువరుసలో నిలుస్తుందని శిబిరాన్ని పర్యవేక్షించిన సంస్థ మేనేజర్, 'మాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండమూడి బోస్, మాల మహానాడు అధ్యక్షుడు జ్యోతుల బాబి, పరంజ్యోతి, ఆనె రవీంద్ర, రావూరి సతీష్, గండి కోటి, ఆంజనేయులు, కోట్ల దిలీప్, రాజేష్, పులి, శౌరి, భాస్కర్, రవి, వర తదితరులు పాల్గొన్నారు.

ఏపీ దేశీయ వైద్య సంఘంతో ఆయుర్వేద వైద్యానికి ప్రోత్సాహం



సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న పాంగురంగ విఠల్

తెనాలి: దేశీయ వైద్యసంఘంతో ఆయుర్వేద దేశీయ సాంప్రదాయాన్ని మరింతగా ప్రజలకు చేరువచేసేందుకు రాష్ట్రంలో ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని విశ్రాంత అదనపు ఎస్పీ పాండురంగ విఠల్ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని ధన్వంతరి వైద్యశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్యసంఘం సభ్యత్వ నమోదును నిర్వహించారు. తెనాలి ప్రాంతీయ కన్వీనర్ డాక్టర్ జూటూరు సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామాల శ్రీనివాసరావు మాట్లాడారు. పలువురు గ్రామీణ వైద్యులు సంఘ సభ్యత్వాలను పొందారు. గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తికొండ హనుమంతరావు, కార్యదర్శి కొలిపాక అంజిబాబు, ప్రభాకర్ రెడ్డి, టి.శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణు రాధాకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి క్షేత్రాలను ప్రశంసించిన బ్రెజిల్ బృందం

జిల్లాలో ముగిసిన పర్యటన



అత్తోటలో ద్రవ జీవామృతం ఉపయోగించిన విధానాన్ని పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు బ్రెజిల్, శ్రీలంక, యూఏఈ దేశాలకు చెందిన సుమారు 30 మందితో కూడిన బృందం ఈనెల 2వ తేదీ నుంచి బుధవారం వరకు ఏడు రోజులపాటు నూతక్కి గ్రామం, కొల్లిపర, అత్తోట, దావులూరిపాలెంలలో విస్తృతంగా పర్యటించింది. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారులతో కలసి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, అనేక విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అత్తోట, నూతక్కి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వివిధ పంటలను, వారు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. ఈపర్యటనలో తమకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఏర్పడిందని బృంద సభ్యులు తెలిపారు. అనంతరం అత్తోట గ్రామంలో ఫైవ్-లేయర్ ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను సందర్శించి, వరి పంట బ్లాక్‌లో ద్రవ జీవామృతం ఉపయోగించిన విధానం, మార్కెటింగ్ విధానాలను, పీజీఎస్ సర్టిఫికెట్ గురించి తెలుసుకున్నారు. రైతుసాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ అధికారి లక్ష్మానాయక్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, స్టేట్ టీం వాణిశ్రీ,, అదనపు డీపీఎం సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణ గురవయ్య కాలనీకి చెందిన రమేష్‌కుమార్‌కు, అదే కాలనీకి చెందిన గోపాల్, అన్వేష్‌లకు వినాయక చవితి పండుగ సందర్భంలో ఘర్షణ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న గోపాల్, అన్వేష్ మరో ఇద్దరు స్నేహితులతో కలసి రమేష్‌కుమార్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితుడు చికిత్స తీసుకుంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత



చెరుకుపల్లి: పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు బహూకరించటం అభినందనీయమని ఎంఈఓ టి.నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం కాటూరు నాగేశ్వరరావుకు ఇటీవల గుంటూరులో కేవీఆర్ అండ్ జయలక్ష్మీ మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్టు వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారం అందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందన సభ ఏర్పాటు చేసి నాగేశ్వరరావును దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ నాగేశ్వరరావు విద్యార్థులను విద్యతో పాటు వారికి ఆసక్తి ఉన్న అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తారన్నారు. అదేవిధంగా తన దాతృత్వాన్ని చాటుకుంటారన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు, ఉపాధ్యాయులు మరదాప కోటేశ్వరరావు, రమాదేవి, గోపికృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ పేరుబోయిన గోవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి విరిగిన విద్యుత్ స్తంభం



తెనాలి అర్బన్: ఒక్కసారిగా వాతావరణంలో మార్పుల వలన బుధవారం రాత్రి తెనాలిలో భారీగాలులతో కూడిన వాన పడడంతో సుల్తానాబాద్ వద్ద డివైడర్ మధ్యలో ఒక విద్యుత్ స్తంభం విరిగి అడ్డంగా హై టెన్షన్ విద్యుత్ వైర్ల పై ఒరిపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న మున్సిపల్ కమిషనర్ రామ అప్పల నాయుడు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించి, విద్యుత్ నిలిపివేసి విద్యుత్ సిబ్బందితో విరిగిపోయిన స్తంభాన్ని సరిచేయించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరింపజేశారు.

సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ రామఅప్పల నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు జేఏసీ నాయకులు

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ తెనాలి నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కమిషనర్ జాగారపు రామ అప్పల నాయుడును మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నుంచి వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు చెప్పారు. మున్సిపల్ అధికారులు సహకరించాలని కోరారు. జేఏసీ నాయకులు శేషుబాబు, ఆశాదీప్, వీరేంద్ర, ప్రశాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.